ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 284 బుధవారం 09-10-2024 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు జీలు : 4 వెల : 5 రూ/..

# బిజెపి హ్యాట్రిక్ విజయం

## ముచ్చటగా మూడోసారి హర్యానాలో ప్రభుత్వం

### 90 స్థానాల్లో 48 సీట్లు సాధించి
### సంపూర్ణ ఆధిక్యం
### కాశ్మీర్‌లో కాంగ్రెస్ కూటమికి
### సంపూర్ణ మెజార్టీ
### నేషనల్ కాన్ఫరెన్స్‌కు 42 సీట్లు..
### కాంగ్రెస్‌కు 6

**తొలి సమయం హైదరాబాద్ :** హర్యానాలో ముచ్చటగా మూడోసారి బీజేపీ విజయం సాధించింది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ ఎవరు ఊహించని విధంగా కాషాయ పార్టీ హ్యాట్రిక్ కొట్టింది. హర్యానాలోని మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకుగానూ 48 సీట్ల విజయ ఢంకా మోగించి ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మేజిక్ ఫిగర్ 46 సీట్ల మార్క్‌ను క్రాస్ చేసింది. తద్వారా మరోసారి హర్యానా గడ్డపై బీజేపీ జెండా రెపరెపలాడనుంది. కాగా, ఎన్నికల కౌంటింగ్ మొదట్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు అనుగుణంగా బీజేపీ వెనుకంజలో ఉండగా.. కాంగ్రెస్ భారీ అధిక్యం సాధించింది. దీంతో ఎగ్జిట్ పోల్స్ అంచనాల మేరకు కాంగ్రెస్ పార్టీ హర్యానాలో విజయం సాధించడం ఖాయమని అంతా ఫిక్స్ అయారు. ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం వద్ద హస్తం పార్టీ శ్రేణులు బాణాసంచా కాల్చుతూ, సీట్లు పంపుకుంటూ ఏకంగా సంబురాలు చేసుకున్నారు. కానీ ఆ ఆనందం కాంగ్రెస్ కార్యకర్తలకు ఎంతో సేపు నిలువలేదు. మూడు, నాలుగు రౌండ్ల



కౌంటింగ్ నుండి బీజేపీ తన సత్తా చాటింది. వరుస రౌండ్లలో అధిక్యం సాధిస్తూ జెడ్ దూసుకొచ్చింది. అప్పటి వరకు మొదటి స్థానంలో కొనసాగిన కాంగ్రెస్ బీజేపీ దెబ్బకు రెండో స్థానానికి పరిమితం అయ్యింది. అక్కడ నుండి ఇక కాంగ్రెస్ పార్టీ బీజేపీని బీట్ చేయలేక సెకండ్ ప్లేస్?లోనే నిలిచిపోయింది. 37 స్థానాలకే పరిమితమై మరోసారి అధికారానికి కాంగ్రెస్ దూరమైంది. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మేజిక్ ఫిగర్‌కు (46 స్థానాలు) 9 సీట్ల దూరంలో ఆగిపోయిన కాంగ్రెస్.. హర్యానాలో మరోసారి ప్రతిపక్షానికి పరిమితమైంది. ఇక, కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోకుండా ఒంటరిగా బరిలోకి దిగిన ఆప్ ఘోర పరాజయం పాలైంది. పోటీ చేసిన అన్ని స్థానాల్లో ఓటమి పాలై.. కనీసం ఖాతా కూడా తెరవలేదు.

**ఒమర్ సిఎంగా ఏర్పడనున్న కొత్త ప్రభుత్వం**

జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో జమ్మూ అండ్ కశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ కూటమి మెజారిటీ మార్క్‌ను దాటి అధికార పీఠాన్ని ఖాయం చేసుకుంది. ఏకైక పెద్ద పార్టీగా నేషనల్ కాన్ఫరెన్స్ 42 సీట్లు కైవసం చేసుకోగా, భాగస్వామ్య కాంగ్రెస్ పార్టీ 6 సీట్లు, మరో భాగస్వామ్య పార్టీ సీపీఎం ఒక స్థానాన్ని గెలుచుకున్నాయి. దీంతో ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన 48 సీట్ల మ్యాజిక్ ఫిగర్‌ను కూటమి దక్కించుకుంది. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చతికిలపడిన నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ ఈ ఎన్నికల్లో తిరిగి పూర్తి స్థాయిలో తమ సత్తాను చాటుకుంది. ఎన్‌సీ పార్టీ సొంతంగా 42 సీట్లు గెలుచుకోవడం, ఒమర్ రెండోసారి ముఖ్యమంత్రి కావడానికి మార్గం సుగమమైంది. 2009 నుంచి 2015 వరకూ ఆయన గతంలో ముఖ్యమంత్రిగా పనిచేశారు.

# ఎల్బీ స్టేడియంలో మెగా డీఎస్సీ వేడుక

### సిఎం చేతుల మీదుగా నేడు పట్టాల పంపిణీ

**తొలి సమయం హైదరాబాద్,**

ఎల్బీ స్టేడియంలో బుధవారం డీఎస్సీ కొలువుల పండగ జరగునుంది. డిఎస్సీ అర్థ పొందిన వారికి సీఎం రేవంత్ రెడ్డి నియాక పత్రాలు అందచేయనున్నారు. ఎంపికైన అభ్యర్థులకి డీఎస్సీ ఉత్తర్వులు ఇవ్వనున్నారు. ఈ కారణంగా.. ఎల్బీ స్టేడియం వైపుగా వచ్చే వారికి ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఏఆర్ పెట్రోల్ బంక్ జంక్షన్ నుంచి బీజేఆర్ విగ్రహం వైపు వచ్చే ట్రాఫిక్‌ని ఏఆర్ వద్ద డైవర్ట్ చేసి నాంపల్లి రైల్వే స్టేషన్ వైపు మళ్ళించనున్నారు. బషీర్‌బాగ్ నుంచి ఏఆర్ జంక్షన్ వైపు వచ్చే ట్రాఫిక్‌ని పెట్రోల్ బంక్, బీజేఆర్ విగ్రహం వద్ద , అబిడ్స్, నాంపల్లి స్టేషన్ రోడ్డు వైపు డైవర్ట్ చేయనున్నారు. రవీంద్ర భారతి నుంచి బీజేఆర్ విగ్రహం వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులను ఏఆర్ వద్ద మళ్లించనున్నట్లు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ వెల్లడించింది. ఎల్బీ స్టేడియం వైపు వెళ్లే నగరవాసులు ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు. అక్టోబర్ 12న దసరా పండుగ కావడంతో హైదరాబాద్ నుంచి సద్దుల బతుకమ్మ, దసరా పండుగులకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా



టీజీఎస్ఆర్టీసీ కూడా అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ పండుగలకు రాష్ట్రవ్యాప్తంగా 6304 ప్రత్యేక బస్సులను నడుపుతోంది. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఎల్బీనగర్ ఆరాంఘర్, కూకట్ పల్లి, గచ్చిబౌలి, బోయిన్ పల్లి, జగద్గిరిగుట్ట, సుచిత్ర, ఐఎస్ సదన్, బోరబండ, శంషాబాద్‌లలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అందుకే ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంప్‌లను ఏర్పాటు చేసి ప్రయాణికులకు అన్ని సౌకర్యాలను కల్పించాలని టీజీఎస్ఆర్టీసీ నిర్ణయించింది.

# ఈ ఫలితాలు బిజెపికి ప్రత్యేకం

### హర్యానా ప్రజలు, కార్యకర్తల కృషి అమోఘం
### కాశ్మీర్ ప్రజలకు కూడా కృతజ్ఞతలు
### కాంగ్రెస్ రాజకీయాలపై మోడీ ఘాటు విమర్శలు

**న్యూఢిల్లీ,అక్టోబర్ 8:** హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ కి స్పష్టమైన మెజారిటీ ఇచ్చినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీఆ రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తామని మరోసారి భరోసా ఇచ్చారు. మంగళవారం వెలువడిన హర్యానా ఎన్నికల ఫలితాల్లో బీజేపీ 48 సీట్లు కైవసం చేసుకుని మెజారిటీకి అవసరమైన 46 సీట్లను సునాయాసంగా దాటింది. దీంతో పార్టీ శ్రేణుల్లో సంబరాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో హర్యానా ప్రజలకు సామాజిక మాధ్యమంలో వరుస పోస్టుల్లో మోదీ కృతజ్ఞతలు తెలిపారు. భారతీయ జనతా పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఇవ్వడం ద్వారా హర్యానా ప్రజలు మరోసారి తమ సత్తాను చాటుకున్నందుకు కృతజ్ఞతలు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనుకంజ వేసే ప్రసక్తి లేదని భరోసా ఇస్తున్నాను అని మోదీ ట్వీట్ చేశారు. మరో ట్వీట్‌లో ఇంతటి ఘన విజయానికి అంకితభావంతో అవిశ్రాంతంగా కృషి చేసిన పార్టీ



కార్యకర్తలందరికి ఆయన అభినందలు తెలియజేశారు. పార్టీ అభివృద్ధి ఎజెండాను కార్యకర్తలు ఇంటింటికి తీసుకువెళ్లడం కూడా పార్టీ విజయానికి ఒక కారణమని ప్రశంసించారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాల సరళిని హరియాణా ఎన్నికలు తారుమారు చేశాయి. ఈ ఫలితాలు భాజపాను మరోసారి అధికార పీఠమెక్కించాయి. వరసగా మూడోసారి కాషాయ పార్టీ సాధించిన విజయంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. అభివృద్ధి, సుపరిపాలన రాజకీయాలు గెలిచాయని వ్యాఖ్యానించారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు భాజపా ఎలాంటి అవకాశాన్ని వదిలేయదన్నారు. హరియాణాలో సుపరిపాలన విజయం సాధించింది. అభివృద్ధి, సుపరిపాలన రాజకీయాలు గెలిచాయి. మూడోసారి కూడా భాజపాను గెలిపించిన హరియాణా ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. పార్టీ అభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త ఎంతో శ్రమించారు. దీని ఫలితంగానే కాషాయ పార్టీ మరోసారి నెగ్గింది. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు భాజపా ఎలాంటి అవకాశాన్ని వదిలి పెట్టదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఫలితాలపై స్పందించిన ప్రధాని.. ఎన్సీకి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కార్యాలయంలో విజయోత్సవ సభలో మోడీ మాట్లాడారు.

## బిజెపి ఎలాంటి ట్రిక్స్ ప్లే చేయొద్దు: ఒమర్ అబ్దుల్లా

**శ్రీనగర్,అక్టోబర్ 8:**

జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంగా మారిన తర్వాత జరిగిన ఎన్నికల ఫలితాల్లో నేషనల్ కాన్ఫరెన్స్ ఆధిక్యాన్ని ప్రదర్శిస్తోంది. ఈసందర్భంగా ఆ పార్టీ నేత, జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పందించారు. ప్రజాతీర్పును గౌరవించాలని, ఎలాంటి కుట్రలు పన్నొద్దని ఆయన అన్ని పార్టీలను కోరారు. లెక్కింపు వేళ మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు.'మేం విజయం సాధిస్తామనే ఆశాభావంతో ఉన్నాం. జమ్మూకశ్మీర్ ఓటర్లు తీసుకున్న నిర్ణయం ఈ రోజు తెలుస్తుంది. ఈ మొత్తం పక్రియలో పారదర్శకత ఉండాలి. ప్రజల తీర్పు భాజపాకు వ్యతిరేకంగా ఉంటే వారు ఎలాంటి ట్రిక్స్ ప్లే చేయొద్దు. ఆ పార్టీ ఎలాంటి కుట్రల్లో భాగం కావొద్దు అని వ్యాఖ్యలు చేశారు. రెండు అసెంబ్లీ స్థానాలు గండేర్బల్, బుడ్గామ్ నుంచి పోటీపడిన ఒమర్.. ప్రస్తుతానికి రెండుచోట్ల ఆధిక్యాన్ని ప్రదర్శిస్తున్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ 40 స్థానాల్లో ఆధిక్యంలో ఉండగా.. భాజపా 25, కాంగ్రెస్ 11, పీడీపీ 5, ఇతరులు 9 స్థానాల్లో ఆధిక్యంలో ఉన్నారు.

### హెచ్‌సీఏలో రూ.3.8 కోట్ల
# మేర అక్రమాలు
### ముగిసిన అజహరుద్దీన్ ఇడి విచారణ



**హైదరాబాద్,అక్టోబర్8 :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ మాజీ ఎంపీ మహమ్మద్ అజహరుద్దీన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)విచారణ ముగిసింది. దాదాపు 10గంటల పాటు ఆయన్ను ఈడీ అధికారులు విచారించారు. హెచ్‌సీఏలో రూ.3.8 కోట్ల మేర అక్రమాలపై ఆయన్ను ప్రశ్నించినట్లు సమాచారం. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'హెచ్‌సీఏ కేసులో ఈడీ విచారణకు పిలిచింది. ఈడీ అధికారులకు సహకరించాను. నాపై పెట్టిన కేసులన్నీ అక్రమ కేసులే. కుట్రపూరితంగా నాపైఅక్రమ కేసులు పెట్టారని తెలిపారు. హెచ్‌సీఏలో జరిగిన ఆర్థిక అవకతవకల వ్యవహారంలో ఇటీవల ఈడీ ఆయనకు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియానికి సంబంధించి జనరేటర్లు, అగ్నిమాపక వాహనాలు, ఇతర సామగ్రి కొనుగోళ్లకు సంబంధించి అవకతవ కలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో అజహర్‌కు ఈడీ నోటీసులు ఇచ్చి విచారణకు రావాలని ఆదేశించగా.. మంగళవారం హైదరాబాద్‌లోని ఆ సంస్థ కార్యాలయానికి వెళ్లారు.

### 10న ట్యాంక్‌బండ్‌పై
# సద్దుల బతుకమ్మ

### భారీగా ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం
### ఫైర్ వర్క్స్, లేజర్‌షోలతో ఆకట్టుకునేలా ఏర్పాట్లు
### అధికారులతో సమీక్షించిన సిఎస్ శాంతికుమారి

**తొలి సమయం హైదరాబాద్,**

హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ పై దాదాపు పదివేల మంది మహిళలతో ఈనెల 10 వతేదీన సద్దుల బతుకమ్మ ఉత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలియచేశారు. 10వ తేదీన నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకల ఏర్పాట్ల పై నేడు సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల కార్యదర్శులు, పోలీస్ అధికారులు హాజరైన ఈ సమావేశంలో సి.ఎస్. మాట్లాడుతూ, 10వ తేదీ సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగాగల అమరవీరుల స్మారక కేంద్రం నుండి వేలాది మంది మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా ట్యాంక్ బండ్ పైకి చేరుకుంటారని, వీరితోపాటు వందలాది మంది కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వస్తారని వివరించారు. ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసే వేదిక వద్ద జరిగే ఈ బతుకమ్మ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరవుతారని అన్నారు. ఈ సందర్భంగా, బుద్ధ విగ్రహం, సంజీవయ్య పార్క్ లనుండి ప్రత్యేకంగా ఫైర్ వర్క్స్, లేజర్ షో ల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. ఈ బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని పండగ శోభ వచ్చేలా నగరంలోని 150 ప్రధాన



కూడళ్లలో బతుకమ్మలను ఏర్పాటు చేయడమే కాకుండా పలు జంక్షన్ల కేంద్రాల వద్ద విధ్యుత్ దీపాలతో అలంకరించినట్టు తెలిపారు. నగరంలోని అన్ని ప్రధాన కార్యాలయాలను కూడా విద్యుత్ దీపాలతో అలంకరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ట్యాంక్ బండ్ పై బతుకమ్మ ఆడేందుకు సమీపంలోని వాడలు, కాలనీలు, బస్తీల నుండి పెద్ద ఎత్తున మహిళలు వచ్చే అవకాశమున్నందున వారికి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా, ట్యాంక్ బండ్ చిల్డన్స్ర పార్క్ లోఉన్న బతుకమ్మ ఘాట్ తోపాటు నె÷-లకెస్ రోడ్డులో బతుకమ్మ ల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాటు చేయాలని హెచ్ఎండీఏ, జీహెచ్ ఎంసీ అధికారులను కోరారు.

### అన్ని వర్గాల అభ్యున్నతే
# ప్రభుత్వ లక్ష్యం
### పాలేరులో ఉచిత చేపపిల్లల పంపిణీ చేసిన పొంగులేటి



**ఖమ్మం,అక్టోబర్ 8:** రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ఇందిరమ్మ ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు ప్రాజెక్టులో ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. త్వరలోనే ప్రభుత్వం పేదప్రజలకు ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తుందన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో పేదోడి ముఖంలో చిరునవ్వు చూడటమే లక్ష్యమన్నారు. వరదల్లో కనివీని ఎరుగని రీతిలో ఇక్కడి ప్రజలు నష్టపోయారు. మత్స్యకారులకు తీవ్ర నష్టం మిగిల్చింది. ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తుంది. చేపల పంపిణీ కార్యక్రమాన్ని పండుగలా చేస్తుంది. ప్రభుత్వం పూర్తి సబ్సిడీతో చేపపిల్లల పంపిణీ చేస్తుంది. మృత్స్యకారులను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యం. గత ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమాన్ని పట్టించుకోలేదు. రాజకీయ, ఆర్థికంగా ఈ సామాజికవర్గం అభివృద్ధి కావాలని సీఎం రేవంత్ ఆలోచనలు చేస్తున్నారు. రాష్ట్రంలో అన్ని కులవృత్తులను ప్రోత్సహిస్తున్నం. మీా ఎమ్మెల్యేగా మీాకు అండగా ఉంటా.. అందరికి అందుబాటులో ఉండి సేవ చేస్తా' అని పొంగులేటి అన్నారు.

# ఇసుక దందా పై రెవిన్యూ, మైనింగ్ అధికారుల బాధ్యతలపై అనుమానాలు

### వోల్టా చట్టం మార్గదర్శకాలను అటకెక్కించిన రెవిన్యూ,మైనింగ్ అధికారులు

### ఇసుక మాఫియాకు కాసుల కురిపిస్తున్న ఆకేరు ఇసుక



**తొలి సమయం మహబూబాబాద్ అక్టోబర్ 8:** ఇసుక దందా జిల్లా మొత్తంగా వ్యవస్థీకృత నేరంగా తయారు అయ్యింది. వరద బీభత్సంతో డోర్నకల్ నియోజకవర్గ మొత్తం ఉక్కిరిబిక్కిరి అయింది. దాంతో పాటుగా ఇసుక మేటలు ఆకేరుకు ఇరువైపులా గుట్టలు గుట్టలుగా పేరుకున్నాయి. ఆకేరు ఒడ్డు మొత్తంగా ఇసుక మేటలు గుట్టలుగా విస్తారంగా ఏర్పడ్డాయి.. ఇసుకను అమ్ముకోవడం కోసమే.. రైతులు పొలాల లాగా మళ్లను ఏర్పాటు చేసుకొని పొలాలు ఇసుకతో నిండాయి అని కారణాలు చూపెడుతున్నారు... యోగ్యత లేని నిరుపయోగంగా ఉన్న ఏటి ఒడ్డును పొలం అంటూ నమ్మిస్తున్న రైతుల ద్వారా ఇసుక మాఫియా కు కాసులు కురిపిస్తున్నాయి.. గత 15 రోజుల నుండి.. గుండ్రాతిమడుగు అడ్డరోడ్డు బంచరాయి తండా సమీపంలో ఆకేరు ఇసుకను రాత్రింబవళ్లు అడ్డు అదుపు లేకుండా తరలిస్తున్నారు.. పల్లెటూర్లలో ఈజీ మనీ కి అలవాటు పడిపోతున్న కూలీలు వ్యవసాయ పనులలను నిర్లక్ష్యం చేస్తూ.. ఇసుక దందాకు ఉపయోగపడుతున్నారు,పొద్దంతా పనిచేసిన 500 రావు కానీ రేయి పగళ్ళు ఇసుకను ట్రాక్టర్ ట్రక్కులు నింపితే రోజుకు 2000 ఆదాయం ఉంటుంది.. కనుక అక్రమ ఇసుక లో ఉన్న మజా వ్యవసాయంలో లేదు.. కాబట్టి వ్యవసాయ రైతులకు కూలీలు దొరకక పోవడానికి కారణం ఇసుక మాఫియానే అనేది తెలుస్తోంది,బంచరాయి నుండి ఇసుకను కొరివి మహబూబాబాద్, బయ్యారం మండల కేంద్రాలు, గ్రామాలకు తరలిస్తున్నారు..ట్రాక్టర్ ఒక్కంటికి 5000 రూపాయలు పోగేసుకుంటున్నారు.. పర్యావరణము ప్రకృతి గ్రౌండ్ వాటర్ కు రక్షణ కవచంగా ఉన్న వోల్టా చట్టం మార్గదర్శకాలను అధికారులు ప్రజలను చైతన్య పరచడంలో వైఫల్యం చెందడం మూలంగానే.. మట్టి, ఇసుక మాఫియా చెలరేగిపోతున్నట్లు పర్యావరణ ప్రేమికులు భావిస్తున్నారు. రాత్రింబవళ్లు ట్రాక్టర్ల మోతతో తండావాసులు, గ్రామవాసులు ఇబ్బందులు పడుతున్నారు. మితిమీరిన వేగంతో ట్రాక్టర్లు నడవడం మూలంగా. జనం యాక్సిడెంట్స్ భయంతో వనికి పోతున్నారు. ఈ అక్రమ తతంగమంతా అధికారుల కనుసన్నల్లోనే నడుస్తున్నట్లుగా పలు అనుమానాలకు తావిస్తోంది, రెవెన్యూ,మైనింగ్ అధికారుల కనుసన్నల్లోనే ఇసుక మట్టి మాఫియా రెచ్చిపోతున్నట్లు జనం ఓపెన్ గానే మాట్లాడుకుంటున్నారు. ఇక మైనింగ్ అధికారులు ఫోన్ లిఫ్ట్ చేయరు,వివరణ ఇవ్వరు. జిల్లా కార్యాలయానికి వెళితే ఎమర్జెన్సీ పని మీద వెళ్తున్నామంటూ వివరణ ఇవ్వకుండా దాటేస్తున్నారు.. బంచరాయి తండా సమీపంలోని ఆకేరు అక్రమ ఇసుక దందాపై కొరివి ఎమ్మార్వో ను వివరణ కోరగా... ఎస్సై కి సమాచారం ఇవ్వండి అని సింపుల్ గా చెప్పేస్తున్నారు.. కానీ పోలీసులు రెవిన్యూ మైనింగ్ అధికారులు ముందుండాలి ఆ తర్వాతనే మేముంటాము అని తెగేసి చెబుతున్నారు కళ్ళముందే వందలాది ట్రాక్టర్లు ఆకేరు నుండి ఇసుకను సజావుగా తరలిస్తూ ఉంటే.. కొరివి ఎమ్మార్వో ఏమీ తెలవనట్లే. నిమిత్తమాత్రులుగా మాట్లాడుతున్నారు.. కనుక రెవెన్యూ, మైనింగ్, అధికారులు దోబూచులాడకుండా, ఇరిగేషన్, ఆర్టీఏ మరియు పోలీస్ అధికారుల సమన్వయంతో ఆకేరు ఇసుక దందాను అరికట్టి... రాత్రింబవళ్ల ట్రాక్టర్ల మోతలతో ఇబ్బంది పడుతున్న జనం సమస్యకు





పరిష్కారం చూపించాలని ప్రజలు కోరుకుంటున్నారు... వోల్టా చట్టం మార్గదర్శకాల పై ప్రజల్లో చైతన్యంతో పాటు, అధికారులు తూచా తప్పకుండా పాటించే విధంగా కలెక్టర్ వెంటనే యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకొని ఇసుక మాఫియాను అరికట్టాలని పర్యావరణ ప్రేమికులు కోరుకుంటున్నారు కోరుకుంటున్నారు.



# పరిధులు దాటుతున్న ఆర్ఎంపి వైద్యం



**తొలి సమయం, చర్ల, అక్టోబర్ 08**
చర్ల మండల కేంద్రంలోని కామ్రేడ్ డీవీకే భవన్లో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా పార్టీ అత్యవసర సమావేశం మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి పార్టీ భద్రాచలం డివిజన్ నాయకులు కొండా చరణ్ పాల్గొని మాట్లాడుతూ చర్ల మండలంలో కొందరు ఆర్ఎంపీలు తమ హద్దులు దాటి వైద్యం చేస్తున్నారని ఆ వైద్యం కాస్త వికటించి ప్రజలు నిండు ప్రాణాలను కోల్పోతున్నారని ఆయన మండిపడ్డారు. దీనికి నిలువెత్తు నిదర్శనం రెండు రోజుల క్రితం ఒక అమ్మాయి చర్ల లో ఒక ఆర్ యం పి కేంద్రంలో మరణించడమే అని గుర్తు చేశారు.ఇటీవల కాలంలో పాల్వంచ ప్రాంతంలో ఐదేళ్ల పసివాడు వైద్యం నిమిత్తం స్థానిక ఆర్ఎంపీని ఆశ్రయించగా ఆ పసివాడికి వైద్యం వికటించి శరీరం మొత్తం రక్తపు బొగ్గలు వచ్చి నరకం అనుభవించి చనిపోయిన విషయం నిజం కాదఅని గుర్తు చేశారు.దీనికి కారణం ఆర్ యం పి వైద్యం కాదా అని ప్రశ్నించారు.ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆర్ఎంపీలపై ఈ ప్రభుత్వం తక్షణమే విచారణ జరిపి నిజ నిజాలు నిర్ధారించి చర్యలు చేపట్టాలని తద్వారా ప్రజల ప్రాణాలు కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ సమస్యను అనేకసార్లు లేవనెత్తినప్పటికీ ఈ ప్రాంత డి ఎం అండ్ హెచ్ ఓ ఆర్ఎంపీల కేంద్రాలను ఎందుకు తనిఖీలు చేపట్టడం లేదని ఆయన ప్రశ్నించారు. తక్షణమే ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న కొందరు ఆర్ఎంపీలపై చట్టరిత్య చర్యలు చేపట్టాలని ఆయన ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిఎడల నష్టపోయిన బాధిత కుటుంబాలను ఐక్యం చేసి ప్రజల ప్రాణాలను కాపడుకోవడం కోసం సి పి ఐ యం ఎల్ మాస్ లైన్ ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమ బాట పడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పార్టీ చర్ల మండల కార్యదర్శి కొండా కౌశిక్ ,మండల నాయకులు చెన్నం మోహన్,రేగాఆంద్రయ్య,తదితర లు పాల్గొన్నారు.

# ఏఎన్ఎస్ ఆధ్వర్యంలో బాలగోపాల్ 15వ సంస్మరణ సభ

### - పౌర హక్కుల నేతకు ఘన నివాళి - ఆదివాసీల ఆత్మ బంధువు బాలగోపాల్

**తొలి సమయం, నూగురు వెంకటాపురం, అక్టోబర్ 08**
పౌర హక్కుల సాధన కోసం అహర్నిశలు శ్రమించిన మహోన్నత వ్యక్తి బాలగోపాల్ అని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి అన్నారు.పౌర హక్కుల నేత బాలగోపాల్ 15 వ సంస్మరణ సభ ఆదివాసీ నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో వెంకటాపురం సొసైటి ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు.పౌర హక్కుల నేతకు ఘన నివాళులు అర్పించారు. బాలగోపాల్ గతంలో న్యాయస్థానం లో తీర్పులు జరిగి, అన్యాయానికి గురైన ఆదివాసీల పక్షాన న్యాయ పోరాటం చేసి రెస్ జ్యూడికేటా అనే న్యాయ సూత్రాన్ని సాధించినట్లు నర్సింహా మూర్తి తెలిపారు. దీని ద్వారా మళ్ళీ కోర్టులో కేసు ఓపెన్ చేసి న్యాయం కోసం పోరాటం చేసే అవకాశం ఉందన్నారు. ఒకే మనిషి ఒకే విలువ ఉండాలని పోరాటం చేశారని అన్నారు. డబ్బు, పలుకుబడి, కులాన్ని బట్టి విలువ ఇవ్వకూడదు అని బాలగోపాల్ అభిప్రాయం వ్యక్తం చేసినట్లు నర్సింహా మూర్తి తెలియజేసారు. ముఖ్య అతిథులుగా సీనియర్ ఉధ్యాయులు ఎట్టి బాబురావు, చింత సర్వేశ్వర్రావు, సిద్దబోయిన సర్వేష్, కుచ్చింటి చిరంజీవి పాల్గొన్నారు. సీనియర్ ఉపాధ్యాయులు ఎట్టి బాబురావు మాట్లాడుతూ ఆదివాసీ, బడుగు బలహీన వర్గాల హక్కుల గొంతుక అయి పాలకులను ప్రశ్నించాడని తెలియజేసారు. రాజ్యాంగ బద్ధమైన, న్యాయ మైన శాంతి యుత పోరాటం చేయడం లో ఆయనకు ఆయనే సాటి అన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉండి విద్యార్థులకు పాఠాల తో పాటు సమాజాన్ని పట్టి పీడిస్తున్న రుగ్మతల పైన పోరాటం చేసినట్లు ఆయన తెలిపారు. అరుదైన గణిత మేధావి అన్నారు. ఆదివాసీ చట్టాలు అయిన 1/70, పెసా చట్టాల అమలు కోసం ఆదివాసీల పక్షాన బాలగోపాల్ పోరాటం చేసినట్లు ఈ సందర్భంగా చింత



సర్వేశ్వరావు పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వేలాది ఎకరాల భూములను ఆదివాసీలకు దక్కడానికి బాలగోపాల్ పోరాటమే కారణం అన్నారు. ఆయన జీవిత ప్రయాణం ఎంతో ఆదర్శవంత మైనదని అన్నారు. న్యాయవాదిగా అణగారిన వర్గాల కోసం న్యాయ పోరాటం చేసినట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం నిలుపుదల చేయాలని బాలగోపాల్ పాదయాత్ర చేసాడని అన్నారు. ప్రతి మనిషికి కనీస మానవ హక్కులు అవసరం అని తుడుందెబ్బ జిల్లా నాయకులు కుచ్చింటి చిరంజీవి అన్నారు. మొట్టమొదటి సారిగా బాలగోపాల్ సేవల గురించి ఈ ప్రాంత ప్రజలకు పరిచయం చేసిన ఏ ఎన్ ఎస్ నాయకత్వానికి ధన్యవాదములు తెలిపారు.ఆదివాసీల పైన వలస గిరిజనేతరుల మూక దాడులు పెరుగడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు సిద్దబోయిన సర్వేశ్వర్రావు మాట్లాడుతూ బాలగోపాల్ చరిత్రను పాఠ్యం శాల్లో పొందు పరచాలని కోరినారు. తద్వారా ఆయన నిస్వార్ధ సేవలు ప్రజలకు తెలిసే అవకాశం ఉందన్నారు. ఈ శాతాబ్దపు చరిత్ర గతిని మార్చిన గొప్ప నాయకుడు అన్నారు. జిఓ 3 ని సాధించుటలో బాలగోపాల్ కృషి ఉందన్నారు. ఈ కార్యక్రమం లో వాజేడు మండల అధ్యక్షులు మొడెం నాగరాజు, వెంకటాపురం మండల కార్యదర్శి చేలే రాజేష్, గొంది కామేష్, ప్రశాంత్, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ కూలీలు స్వశక్తి మహిళలతో మాట్లాడిన కేంద్ర గ్రామీణ అభివృద్ధి అధికారులు

**తొలి సమయం, సైదాపూర్, అక్టోబర్ 08**



మండలంలోని రాములపల్లి సర్వాయిపేట గ్రామాల్లో ఉపాధి హామి కూలీలు, స్వశక్తి సంఘాల మహిళలతో కేంద్ర గ్రామీణభివృద్ధి టీం సభ్యులు రాజేష్, అఖిల్మాన్ లు ఉపాధి హామి పధకం పనులు,స్వశక్తి సంఘాల సభ్యులు లోన్ వాడకం,సమావేశాలు రికవరీ తదితర అంశాలపై మాట్లాడి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు.పెన్షన్ దారులతో మాట్లాడారు.గ్రామ పంచాయితీ రికార్డులు పరిశీలించారు. ఉపాధి హామీ నర్సరీ,ప్లాంటేషన్ లను సందర్శించారు. ఎంపీడీఓ యాదగిరి,జిల్లా అధికారులు,క్రిష్ణ,డిపిఎంలు రవీం దర్, శ్రీనివాస్,ఏపీఎం కుమారస్వామి, రమేశ్,ఏపిఓ రాణి, సీసీలు దేవేందర్, రమేశ్,శ్రీనివాస్ రెడ్డి, జమున,మండల పరిషత్ అధికారులు,గ్రామ స్పెషల్ అధికారులు, ఉపాధిహామీ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు, విఓఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్వాడి ,హెల్త్ సిబ్బంది,పంచాయితీ సిబ్బంది,మహిళలు, కూలీలు పాల్గొన్నారు.

## పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో బతుకమ్మ సందడి



**తొలి సమయం, హన్మకొండ, అక్టోబర్ 08**
వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం లో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించుకున్నారు. బతుకమ్మ నవరాత్రులను పురస్కరించుకొని మహిళా పోలీస్ సిబ్బంది అధికారులు, కుటుంబం సభ్యులు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ కుటుంబ సమేతంగా కలిసి వచ్చి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు

## డ్యూటి మీట్ పోటీల ద్వారా వృత్తిలో నైపుణ్యం సాధించవచ్చు

### వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ



**తొలి సమయం, హన్మకొండ, అక్టోబర్ 08**
డ్యూటీ మీట్ పోటీల్లో పాల్గోనడం ద్వారా పోలీస్ అధికారులు తమ వృత్తిలో మరింత రాణించగలరని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. ఇటీవల రెండురోజల పాటు వరంగల్ పోలీస్ కమిషనర్ కార్యాలయములో నిర్వహించిన జోనల్ పోలీస్ డ్యూటీ మీట్లో విజయం సాధించిన పోలీస్ అధికారులకు వరంగల్ పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా మంగళవారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో పతకాలను బహుకరించారు.భద్రాద్రి జోనల్ పరిధిలోని వరంగల్ కమిషనరేట్, ఖమ్మం,కమిషనరేట్,భద్రాద్రి కొత్తగూడెం, మహబూబా బాద్ జిల్లాలకు చెందిన పోలీస్ అధికారులు పాల్గోన్న ఈ జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ ఈ నెల మూడవ తేది నుండి మూడు రోజుల పాటు వరంగల్ కమిషనరేట్ పరేడ్ మైదానంలో నిర్వహించబడ్డాయి. అధికారులు రోజువారి నిర్వహించే విధులుకు సంబంధించి 18 విభాగాల్లో పోటీలను నిర్వహించి విజేతలుగా నిలిచిన మొదటి ముగ్గురికి పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా పతకాలను అందజేసారు. ఈ పోటీల్లో రాణించిన అధికారులున హైదరాబాద్లో ఈ నెలలో జరిగే తోలి తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్కు పోటీలో పాల్గోన్నాంటారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ వృత్తిలో న్కెపుణ్యం సాధించడం ద్వారా నేరస్థులను గుర్తించడం సులభం కావడంతో పాటు నిందితులకు శిక్షలు పడుతాయని,ఆలాగే బాధితులను న్యాయం చేసినవారమవుతామని పోలీస్ కమిషనర్ తెలియజేసారు.ఈ కార్యక్రమములో అదనపు డిసిపిలు రవి,సంజీవ్,సురేష్ కుమార్, ఎసిపిలు అనంతయ్య, సురేంద్రతో పాటు ఇన్స్పెక్టర్లు,ఆర్.ఐలు ఎస్.ఐలు,ఆర్.ఎస్.ఐలు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గోన్నారు.

## అనాధ చిన్నారుల మధ్య ఘనంగా నగునూరి రాజేందర్ జన్మదిన వేడుకలు





**కరీంనగర్, అక్టోబర్ 08**
కరీంనగర్ పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు నగునూరి రాజేందర్ జన్మదిన వేడుకలు పట్టణములోని బాల సదనం లోని అనాథ చిన్నారుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనాధ చిన్నారులతో కేక్ కట్ చేయించి , అనంతరం వారికి పుస్తకాలు, పెన్నులు, బిస్కెట్స్ లు పంపిణీ చేశారు. పట్టణ ఆర్య వైశ్య సంఘం కోశాధికారి సుద్దాల వెంకటేష్, అదనపు కార్యదర్శి కొంజర్ల శ్రీకాంత్ ఆధ్వర్యములో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేగురి మారుతీ, పుల్లూరి తదితరులు అశోక్ పాల్గొన్నారు.

# వినేశ్ ఫోగట్ సంచలన విజయం

**జులానా నుంచి 4వేల ఓట్ల ఆధిక్యంతో గెలుపు**

**చండీఘడ్,అక్టోబర్ 8:** హర్యానాలో కాంగ్రెస్ గెలుపు ఆశలు సఫలం కాకపోయినా.. అందరి దృష్టిని ఆకర్షించిన జులానా సీటులో మాత్రం కాంగ్రెస్ అభ్యర్థి, ప్రముఖ రెజ్లర్ వినేశ్ ఫోగట్ ఘన విజయం సాధించారు. మొత్తం 15 రౌండ్లలో వినేశ్ ఫోగట్ 4వేలకు పైగా ఓట్ల ఆధిక్యంలో గెలుపొందారు. ఈ విజయంతో మల్లయోధురాలు వినేశ్ ఫోగట్ ఎమ్మెల్యే అయ్యారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో ఆధిక్యం కనబర్చిన కాంగ్రెస్ అభ్యర్థి ఫోగట్.. ఈవీఎం ఓట్ల లెక్కింపులో మొదటి రౌండ్‌లో ముందంజలో దూసుకు పోయారు. ఆ తరువాత రౌండ్లలో స్వల్పంగా వెనకపడ్డారు. మొదటి ఏడు రౌండ్లు పూర్తయ్యేసరికి కొంచెం వెనుకపడిన ఫోగట్.. 8వ రౌండ్ నుంచి ఆధిక్యాన్ని కనబర్చారు. 8,9,10, 11, 12 రౌండ్లలో ఆధిక్యం రావడంతో 12 రౌండ్లు ముగిసే సమయానికి 4వేలకు పైగా ఓట్ల ఆధిక్యాన్ని ఫోగట్ సాధించారు. ప్రస్తుతం ఫలితాల సరళి చూస్తే హర్యానాలో బీజేపీకి మెజార్టీ మార్క్‌కు దగ్గరగా ఉంది. ఇప్పటివరకు ఎన్నికల సంఘం అధికారికంగా వెల్లడించిన ఫలితాల ప్రకారం బీజేపీ 49 స్థానాలో, కాంగ్రెస్ 35 స్థానాల్లో, ఐఎన్ఎల్‌డీ ఒకటి, బీఎస్పీ ఒక స్థానంలో ఆధిక్యంలో ఉంది. ఇతరులు నాలుగు స్థానాల్లో ఆధిక్యాన్ని కనబరుస్తున్నారు. ఇదే ట్రెండ్ కొనసాగితే హర్యానాలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. హర్యానాలో ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటినుంచి బీజేపీపై ప్రజలు పూర్తి వ్యతిరేకతతో ఉన్నారనే ప్రచారం జరిగింది. రైతు ఉద్యమాలు కమలం పార్టీని దెబ్బతీస్తాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడ్డారు. పారిస్ ఒలింపిక్స్ తర్వాత వినేశ్ ఫోగట్ పేరు దేశవ్యాప్తంగా మారుమోగింది. బరువు ఎక్కువుగా ఉన్నారనే కారణంగా ఆమె ÷నైల్స్‌లో పాల్గొనలేకపోయారు. దీంతో పతకం లేకుండానే ఒలింపిక్స్ నుంచి వెనుదిరగాల్సి వచ్చింది. ఒలింపిక్స్ తర్వాత ఆమె పేరు ఎక్కువ ప్రచారంలోకి వచ్చింది. అంతకుముందు రెజ్లర్ల ఉద్యమంలో ఫోగట్ కీలకపాత్ర పోషించారు. కొన్నేళ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఆమె విమర్శలు చేస్తూ వస్తున్నారు. రైతు చట్టాల విషయంలోనూ, రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఘటనలోనూ కేంద్రప్రభుత్వ వైఖరిని ఆమె తప్పుపడుతూ వచ్చారు. హర్యానా ఎన్నికల వేళ ఫోగట్ కాంగ్రెస్‌లో చేరాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. మరో రెజ్లర్ భజరంగ్ పునియాతో కలిసి ఫోగట్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అప్పటినుంచి ఆమెను బీజేపీ సైతం టార్గెట్ చేసింది. జులానా నియోజకవర్గం నుంచి హస్తం పార్టీ తన అభ్యర్థిగా ఫోగట్‌ను ప్రకటించింది. హర్యానాలో కాంగ్రెస్ వేవ్ ఉందని, మరోవైపు ఫోగట్ హర్యానా బిడ్డ కావడంతో ఆమెపై సానుభూతి ఉందనే ప్రచారం జరిగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ వేవ్ కనిపించనప్పటికీ జులనాలో మాత్రం ఫోగట్ విజయం సాధించారు. తన ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి యోగేష్ కుమార్‌పై 4 వేలకు పైగా ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు.

# అసెంబ్లీ ఫలితాల్లో ఆప్‌కు ఆశాభంగం

**రెండు రాష్ట్రాల్లోనూ భంగపాటు**

**న్యూఢిల్లీ,అక్టోబర్ 8:** హరియాణా, జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉత్కంఠ భరితంగా కొనసాగుతున్నాయి. హరియాణాలో బీజేపీ దూసుకెళ్తుండగా.. జమ్మూ కశ్మీర్‌లో ఇండియా కూటమి హవా కొనసాగిస్తోంది. అయితే రెండు రాష్ట్రాల్లో ఒంటరిగా బరిలో దిగిన ఆమ్ ఆద్మీ పార్టీకి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు షాక్ ఇచ్చాయి. ఇప్పటికే ఢిల్లీ, పంజాబ్‌లో అధికారంలో ఉన్న ఆప్ తమ పరిధిని విస్తరించుకోవాలని చూసిన ఆప్‌కు ఆశాభంగం తప్పలేదు. జమ్మూ, హరియాణా రెండు రాష్ట్రాల్లో ఒక్క స్థానంలోనూ ఆప్ ఖాతా తెరవకపోవడం గమనార్హం. ఇప్పటికే ఢిల్లీలో బీజేపీ నుంచి సవాల్ ఎదుర్కుంటున్న ఆమ్ ఆద్మీ పార్టీకి ఈ ఎన్నికల ఫలితాలు షాక్ ఇచ్చాయని అనుకోవచ్చు. మరికొద్ది రోజుల్లో మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలతో పాటు ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో హరియాణా, జమ్మూ కాశ్మీర్ ఎన్నికల్లో ఎదురైన ఫలితాలు ఆప్‌నకు నిరాశ కలిగించడం సాధారణమేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. హరియాణాలో తొలుత కాంగ్రెస్‌తో పొత్తు ప్రయత్నాలు జరిగినా సీట్ల పంపకం తేడాతో కాంగ్రెస్‌తో ఆప్ విబేధించింది. రెండు రాష్ట్రాల్లో అన్ని స్థానాల్లో ఆప్ తమ అభ్యర్థులను బరిలోకి దించి ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. తద్వారా ఓట్ల చీలికతో పరోక్షంగా ఎన్డీఏ కూటమికే ఆప్ పోటీ మేలు చేసిందన్న విమర్శలు ఎదుర్కుంటోంది.

# మెహబూబా ముఫ్తీ కూతురు ఓటమి

**శ్రీనగర్అక్టోబర్ 8:** గుఫ్వారా బిజ్‌బెహరా నియోజకవర్గం నుంచి పోటీ చేసిన పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి, జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ కుమార్తె ఇల్తిజా ముఫ్తీ ఓటమి పాలయ్యారు. నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అభ్యర్థి బషీర్ అహ్మద్ చేతిలో ఓడిపోయారు. ఓటమిని ఆమె అంగీకరించారు. ప్రజా తీర్పును గౌరవిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. తన గెలుపు కోసం కష్టపడిన పీడీపీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఫలితాల ప్రకటనలో ఇసి తీరు అనుమానం

**విమర్శలు గుప్పించిన జైరామ్ రమేశ్**

**న్యూఢిల్లీ,అక్టోబర్ 8:** హర్యానా అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ఓవైపు జరుగుతుండగా ట్రెండ్స్‌ను ఈసీఐ వెబ్‌సైట్ తప్పుదారి పట్టిస్తోందంటూ కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేష్ సంచలన ఆరోపణలు చేశారు. అప్‌డేటెట్ ట్రెండ్స్‌ను చాలా నెమ్మదిగా అప్‌లోడ్ చేస్తోందని విమర్శించారు. పాతబడిన, తప్పుదారి పట్టించే సమాచారాన్ని షేర్ చేయాలని అధికార యంత్రాంగంపై బీజేపీ ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తోందా? అని ప్రశ్నించారు. ఈసీకి మెమొరాండం సమర్పిస్తాం. ఫిర్యాదు చేస్తాం. మా ప్రశ్నలకు ఈసీ సమాధానం ఇస్తుందనే అనుకుంటున్నాం. 10-11 రౌండ్ల ఫలితాలు ఇప్పటికే బయటకు వచ్చాయి. కానీ 4-5 రౌండ్లనే ఈసీ వెబ్‌సైట్ అప్‌లోడ్ చేసింది. ఇది అధికార యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చే ఎత్తుగడే అని జైరామ్ రమేష్ అన్నారు. అయితే అధైర్యపడాల్సిన పనిలేదని, ఆట పూర్తయినట్టు కాదని అన్నారు. ప్రజాతీర్పు కాంగ్రెస్‌కు అనుకూలంగానే వస్తుందని, ప్రభుత్వాన్ని తాము ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. కాగా, జైరామ్ రమేష్ చేసిన ఆరోపణలను ఈసీ తోసిపుచ్చింది. మీ ఆరోపణలు పూర్తిగా ఊహాజనితమని, బాధ్యతారహితంగా ఉన్నాయని పేర్కొంది. నిరాధార ఆరోపణలతో తప్పుదారి పట్టించవద్దని సమాధానమిచ్చింది.

# ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి వేడుకలు

**- మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన అమ్మవారు - నేడు సరస్వతీదేవిగా అమ్మవారి దర్శనం**

**- పట్టువస్త్రాలు సమర్పించనున్న సిఎం చంద్రబాబు దంపతులు**



**తొలి సమయం, విజయవాడ,అక్టోబర్ 8:** ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనక దుర్గాదేవి మంగళవారం మహాలక్ష్మి దేవి అలంకారం లో భక్తులకు దర్శనం ఇచ్చింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారు జామునుంచే బారులు దీరారు. దసరా నవరాత్రి ఉత్సవాలు ఆరో రోజు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, పోలీసులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా బందోబస్తును నిర్వహించారు. నవరాత్రులలో ఏడవ రోజు బుధవారం మూల నక్షత్రం కావడంతో అమ్మవారు సరస్వతి దేవి అలంకారం లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. అమ్మవారికి బుధవారం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల మధ్య ప్రభుత్వం తరపున ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, భువనేశ్వరి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. శరన్నవరాత్రుల్లో అమ్మవారు.. తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారు. ఆ క్రమంలో ఏడో రోజు అంటే ఆశ్వయుజ మాస శుక్ల పక్ష సప్తమి రోజు దుర్గమ్మవారు.. సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. చదువు, విజ్ఞానం, సంగీతం, కళలకు దేవతగా సరస్వతి దేవిని భక్తితో కొలుస్తారు. ఓం శ్రీసరస్వతీ దేవియే నమ: అనే మంత్రం ఈ రోజు చదువుకోవాలి. ఈ రోజు.. అమ్మవారికి అటుకులు, బెల్లం, శనగపప్పు, కోబ్బరి ప్రసాదంతోపాటు దద్యోజనాన్ని నైవేద్యంగా సమర్పించాలి. ఇక సరస్వతి దేవిని తెలుపు రంగు చీరతో అలంకరిస్తారు. అయితే అమ్మవారి జన్మ నక్షత్రం.. మూలా రోజున అమ్మవారిని దర్శించుకుంటే.. శుభ ఫలితాలు కలుగుతాయని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు. ఇక ఈ రోజు అమ్మవారిని పూజించడం వల్ల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారని విశ్వసిస్తారు. శరన్నవరాత్రుల్లో మూల నక్షత్రం రోజు సరస్వతి దేవిని ఆరాధిస్తారు. సప్తమి తిథి సరస్వతి అమ్మవారిది. ఇక అష్టమి దుర్గాదేవి. నవమి, మహార్నవమి మహిషాసుర మర్ధిని పూజిస్తారు. మూల నక్షత్రం ఉన్నప్పుడే సరస్వతి దేవిగా దుర్గమ్మను అలంకరించి.. పూజిస్తారు. మరోవైపు విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువు తీరిన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో దుర్గమ్మ వారు.. బుధవారం సరస్వతి దేవిగా దర్శనమివ్వనున్నారు. ఈ నేపథ్యంలో అమ్మవారి జన్మ నక్షత్రం రోజు.. లక్షలాది మంది భక్తులు ఇంద్రకీలాద్రికి పోటెత్తనున్నారు. ఇప్పటికే గత ఆరు రోజులుగా వివిధ రూపాల్లో దర్శమిస్తున్న అమ్మవారిని దర్శించుకునేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విజయవాడకు తరలి వస్తున్నారు.

# లోక్‌సభ ఎన్నికల పరాభవంతో అప్రమత్తం

**- సోషల్ ఇంజనీరింగ్‌పై భారీగా దృష్టి**

**- ప్రభుత్వ వ్యతిరేకతపై సానుకూల చర్యలు - హ్యాట్రిక్ విజయం సాధించడంలో బిజెపి సక్సెస్**

**న్యూఢిల్లీ,అక్టోబర్ 8:** లోక్‌సభ ఎన్నికల్లో తగిలిన షాక్ నుంచి హరియాణాలో భాజపా వేగంగా పుంజుకొంది. సామాజిక ఇంజినీరింగ్ నుంచి ఎన్నికల వ్యూహాల వరకు అన్నింటికి పదును పెట్టింది. మోదీ-షా ద్వయం అన్నీ తామై రాష్ట్రంలో పార్టీని నడిపించారు. ఫలితంగా ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తల్లకిందులు చేస్తూ హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. పార్లమెంట్ ఎన్నికల్లో హరియాణాలో సీట్లు తగ్గడంతో భాజపా అప్రమత్తమైంది. దీనిని ఉపేక్షిస్తే.. రాష్ట్రం చేజారే ప్రమాదం ఉందని భావించింది. అభ్యర్థుల ఎంపిక నుంచి కుల సమీకరణల వరకు కసరత్తు చేసింది. ముఖ్యంగా జాతీయ స్థాయి నేతలతోకాకుండా.. రాష్ట్ర స్థాయిలోనే భాజపా ఈ పోరాటం చేయడం విశేషం. ప్రీపోల్స్, పోస్ట్ పోల్ సర్వేలు ప్రభుత్వ వ్యతిరేకత బలంగా ఉందని కోడై కూసినా.. ప్రజలు మాత్రం కమలదళానికే పట్టం కట్టారు. భాజపా సోషల్ ఇంజినీరింగ్ కూడా బలంగానే పనిచేసిందనే ప్రచారం జరిగింది. రాష్ట్రంలో జాట్ వర్గం కాంగ్రెస్ ఛత్రం కింద ఏకమవుతోందని భాజపా గ్రహించింది. దీనికి రెజ్లర్ల ఆందోళన కూడా తోడవడంతో బలమైన ఓబీసీ వర్గాన్ని తమ వైపునకు తిప్పుకొనేందుకు నాయబ్‌సింగ్ సైనీకి అధికార పగ్గాలు అందించింది. దీంతో ఆ రాష్ట్రంలో జాట్ వర్సెస్ ఇతరులు అన్న పోరాటంలో పైచేయి సాధించింది. దీనికి తోడు దళితుల్లో బలమైన జాటవ్‌లు కాంగ్రెస్ పక్షం వహించగా.. వారిలో మిగిలిన కులాలు భాజపా వైపు మళ్లాయి. అగ్రకులాలు, పంజాబీలపై భాజపా ఎక్కువగా ఆధారపడింది. ఈక్రమంలో లోక్‌సభ ఎన్నికల్లో నష్టంతో వెంటనే తేరుకొని.. పార్టీ రాష్ట్ర పగ్గాలను బ్రాహ్మణవర్గానికి చెందిన మోహన్‌లాల్ బదోలికి అప్పగించింది. రాష్ట్రంలో ఈ వర్గం ఓట్లు 7.5శాతం ఉంటాయి. 11 సీట్లను ఈ వర్గానికి కేటాయించింది. సాధారణంగా రాష్ట్రంలోని అగ్రకులాలు, పంజాబీల్లో ఎక్కువ కుటుంబాలు దేశ విభజన తర్వాత వలసవచ్చి స్థిరపడ్డవే. వీరు గ్రాండ్ ట్రంక్‌రోడ్ మార్గంలోని అర్బన్ నియోజకవర్గాల్లో అధికంగా ఉంటారు. 2014, 2019 ఎన్నికల్లో వీరే భాజపాకు మద్దతుగా నిలిచారు. మరోవైపు కాంగ్రెస్ జాట్-దళిత్ కూటమి ఏర్పాటుచేసింది. భాజపా యాంటీ జాట్ కూటమితో హస్తం పార్టీ దూకుడు తగ్గించాల్సి వచ్చింది. ముఖ్యంగా జాట్ వర్గానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిగా ప్రకటిస్తే.. అర్బన్ ఓట్లను కోల్పోవచ్చనే ఆందోళన చెందింది. దీంతో సీఎం అభ్యర్థి పేరు ప్రకటనను వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. ఈ ఏడాది ప్రారంభంలో జేజేపీ హఠాత్తుగా మద్దతు ఉపసంహరించిన సమయంలో పార్టీ అధికారం చేజారకుండా కాపాడుకోగలగడం ఎన్నికల్లో కలిసొచ్చింది. మహిళలు కేంద్రంగా భాజపా ఎన్నికల ప్రచారం సాగింది. ఫలితంగా అతివల్లో ఆ పార్టీపై కొంత సానుకూలత ఉంది. రైతు ఆందోళన వల్ల వచ్చిన ప్రతికూల ఇమేజీ నుంచి బయటపడటానికి ఈ ఏడాది ఆగస్టులో 24 పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని నిర్ణయించింది. ఓ రకంగా ప్రభుత్వ వ్యతిరేకతను తగ్గించిందనే చెప్పాలి. ఈసారి నిరుద్యోగ సమస్యను తగ్గించడానికి 10 ఇండస్ట్రియల్ కారిడార్లను రాష్ట్రానికి తీసుకొస్తామన్న హామీ యువతపై పనిచేసింది. వీటిద్వారా 50,000 ఉద్యోగాలు ఇస్తామని పార్టీ పేర్కొంది. అగ్నివీర్‌ల అంశం రాష్ట్రంలో కమలం పార్టీని చాలాకాలం ఇబ్బందిపెట్టింది. దీనికి చెక్‌పెడుతూ.. వారికి 10శాతం రిజర్వేషన్లు ఇస్తామనడంతోపాటు.. బ్యాంకు రుణాల మంజూరు సరళతరం చేస్తామన్న హామీ పని చేసింది. నీరజ్ స్వర్ణపతకం సాధించిన తర్వాత ఆ రాష్ట్రంలో స్పోర్ట్స్ కల్చర్‌ను భాజపా సర్కారు బాగా ప్రోత్సహించిందన్న పేరు కూడా యువతలో మంచి ఇమేజీని తీసుకొచ్చింది. టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీం టాప్స్ వంటి అంశాలు కలిసొచ్చాయి. తాజాగా తాము తిరిగి ప్రభుత్వంలోకి వస్తే 'ఒలింపిక్ నర్సరీ'లను ఏర్పాటుచేస్తామని ఆ పార్టీ పేర్కొంది. అసలే ప్రభుత్వ ఉద్యోగాల్లో అవినీతి తీవ్రంగా ఉందని యువత మథనపడుతుంటే.. ప్రతీ 50 ఓట్లకు ఓ ఉద్యోగాన్ని ఇస్తామంటూ కాంగ్రెస్ నేతలు కొందరు ప్రచారం చేశారు. సిఫార్సుల ఆధారంగా కొలువులంటూ చేసిన ప్రచారం ప్రతిభావంతులైన యువతను భయపెట్టింది. దీనిని భాజపా బలంగా ఓట్ల రూపంలో మలుచుకొంది. మేవాత్‌లో కొంతకాలం క్రితం జరిగిన అల్లర్లతో కొన్ని వర్గాల ఓటర్లు భాజపాకు అనుకూలంగా మారారు. ఎన్నికల్లో భారీ ఎత్తున పాల్గొని ఓటు వేయడం కమలానికి కలసివచ్చింది. మోదీ ఈ సారి హరియాణాలో ఎన్నికల్లో ర్యాలీలను గణనీయంగా తగ్గించుకొని కేవలం నాలుగుకే పరిమితం చేశారు. ఈ ఎన్నికలను రాష్ట్రస్థాయిలోనే పోరాడేట్లు భాజపా హైకమాండ్ వ్యూహ రచన చేసింది. ప్రభుత్వ వ్యతిరేకతకు కళ్లెం వేసేలా.. ముఖ్యమంత్రి ఖట్టర్‌ను మార్చేసిన భాజపా దాదాపు సగంమంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లను నిరాకరించింది. దీంతో ఇప్పటికే స్థానిక ప్రజాప్రతినిధులపై ఉన్న బలమైన వ్యతిరేకతకు చెక్ పెట్టినట్లైంది. మొత్తం 60 మంది కొత్తవారికి అవకాశాలు ఇచ్చింది. మంజూ హుడా, యోగేషన్ బైరాగి, కృష్ణకుమార్, ఆర్తిసింగ్ రావ్ వంటి వారున్నారు. భాజపాకు అహిర్వాల్ బెల్ట్ ఈసారి కూడా బలమైన అండగా నిలిచింది. గురుగ్రామ్, రేవరి, మహేంద్రఘఢ్ ప్రాంతాలు దీనిలోకి వస్తాయి. ఈ బెల్ట్‌లోని 28 అసెంబ్లీ సెగ్మెంట్లలో అత్యధికంగా అర్బన్ ఓటర్లు ఉన్నారు. వారు కమలం పక్షం వహించడం కలిసొచ్చే అంశం. 2019లో హరియాణాలో మిగిలిన ప్రాంతాల్లో సీట్లు తగ్గినా.. ఈ ప్రాంతం మాత్రం గతం కంటే ఒకటి ఎక్కువే భాజపాకు అందించింది. లోక్‌సభ ఎన్నికల్లో గురుగ్రామ్, రోహ్‌తక్, భివానీ-మహేంద్రఘఢ్‌లోని 11అసెంబ్లీ సెగ్మెంట్లలో 10 కమలం పక్షమే వహించాయి.

# ప్రజాస్వామ్యానికి పట్టం కట్టిన కాశ్మీర్

**- 370 రద్దుతో వెల్లివిరుస్తున్న స్వేచ్ఛ - ఉగ్రవాదం నుంచి బయటపడ్డ రాష్ట్రం**

**శ్రీనగర్,అక్టోబర్ 8:** కశ్మీరీ ఓటర్లు నేషనల్ కాన్ఫరెన్స్-కాంగ్రెస్ కూటమికే పట్టం కట్టారు. ఉగ్రవాదం, వేర్పాటువాద ఉద్యమాలతో సతమతమవుతున్న జమ్మూకశ్మీర్ లో ప్రజాస్వామ్యం వెల్లివిరుస్తోంది. 370 ఆర్టకల్ రద్దు తరవాత చేపట్టిన చర్యలు అక్కడ సాధారణ స్థితికి తీసుకుని వచ్చాయి. ఒకప్పుడు ఎన్నికల బహిష్కరణకు పిలుపునిచ్చిన ప్రజలే.. తాజా ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల ముందు బారులు తీరడం, ప్రభుత్వాన్ని ఎన్నుకున్న తీరు మార్పునకు సంకేతంగా కనిపిస్తోంది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత అక్కడ శాంతిభద్రతలు అదుపులోకి తెచ్చేందుకు కేంద్రం ప్రయత్నాలు చేసింది. లెఫ్టినెంట్ గవర్నర్ పలు కీలక నిర్ణయాలతో ముందుకెళ్లారు. మరోవైపు ఉగ్రవాదులను అంతం చేయడమే లక్ష్యంగా భారత సైన్యం అనేక ఆపరేషన్లను చేపట్టింది. అంతేకాకుండా అక్కడ ఎన్నికలను బహిష్కరిస్తామని చెప్పే జమాతే ఇస్లాం వంటి వేర్పాటువాద సంస్థలు కూడా తమ గళాన్ని మార్చినట్లు కనిపిస్తోంది. తమకు తుపాకులు, రాళ్లలో విశ్వాసం లేదని భావించిన స్థానికులు ప్రజాస్వామ్యం వైపే మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన ఆర్టికల్ 370ని రద్దుచేస్తూ కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. దీని నుంచి కొంత వ్యతిరేకత వ్యక్తమైంది. అయినప్పటికీ జమ్మూ కశ్మీర్ అభివృద్ధి నినాదమే తమ అజెండా అని కాషాయ పార్టీ ముందుకెళ్లింది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సుప్రీం కోర్టు సమర్థించింది. ఇది రాజ్యాంగబద్ధమేనని, జమ్మూకశ్మీర్‌ను రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించడమూ చెల్లుబాటవుతుందని స్పష్టంచేసింది. అయితే, సాధ్యమైనంత త్వరగా జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని, సెప్టెంబరు 30 కల్లా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఈ క్రమంలోనే ఎన్నికలను ఈసీ ప్రశాంతంగా నిర్వహించింది. ఎన్నికలు ప్రకటించినప్పటి నుంచి జమ్మూ కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చుట్టే రాజకీయం కొనసాగింది. అక్కడి ప్రధాన రాజకీయ పక్షాలన్నీ ఈ ఎన్నికలను రెఫరెండంగా భావించాయి. తాము అధికారంలోకి వస్తే 370ని పునరుద్ధరణకు అసెంబ్లీలో తీర్మానం చేస్తామని నేషనల్ కాన్ఫరెన్స్ ప్రకటిస్తూ వచ్చింది. అయితే మిత్రపక్షంగా ఉన్న కాంగ్రెస్ మాత్రం ఈ విషయంలో ఎన్సీ వాదనకు దూరంగా ఉంది. ఇక రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పిన పీడీపీ గళం ఈసారి పూర్తిగా మూగబోయింది.

# కాశ్మీర్ ఫలితాలు బిజెపికి దెబ్బ !

కేంద్రంలోని బిజెపి అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నా ..ప్రజలు పెద్దగా ఆమోదించడం లేదు. ప్రజలు వాటిని గుర్తించడం లేదు. ప్రజలు తమ జీవికకు సంబంధించి మాత్రమే ఆలోచిస్తారు. దేశం గురించి ఆలోచించే స్థితిలో లేరు. అందుకే దేశం రెండువేల ఏళ్ల పాటు పరాయిపాలనలో మగ్గింది. దేశం ముక్క చెక్కలయ్యింది. అయినా ప్రజల్లో ఇది నా దేశం అన్న భావన రావడం లేదు. ఇజ్రాయిల్ తరహాలో ఇది నా జన్మభూమి అన్న భావన కలగడం లేదు. దేశంతో ఉన్న అనుబంధం తెగిపోవడమే ఇందుకు కారణం. విభజన సమయంలో ప్రజలు తిరుగుబాటు చేయలేక పోయారు. స్వాతంత్ర్య ఉద్యమం ఉవ్వెత్తున సాగినా స్వరాజ్యం సిద్ధించడంలో ఆలస్యానికి ప్రజల్లో పట్టుదల లేకపోవడమే కారణమని విశ్లేషకుల అభిప్రాయం. ఇదంతా ప్రస్తావన ఎందుకంటే..కాశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు.. అయోధ్యలో రామజన్మభూమిలో రామాలయ నిర్మాణం తరవాత జరిగిన ఎన్నికలను విశ్లేషించినప్పుడు ఈ విషయం స్పష్టంగా గోచరమయ్యింది. కాశ్మీర్ ఎన్నికల్లో బిజెపి పూర్తిగా అధికారం పొందలేకపోయింది. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో అయోధ్యతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రలజు బిజెపియేతర పార్టీలకు పట్టం కట్టారు. ఇలా ఎందుకు జరుగుతుందో అని బిజెపి పాలకులు లెక్కలు వేయడం లేదు. 370 రద్దు చేసిన తరవాత కాశ్మీర్ తప్ప దేశంలోని మిగతా ప్రాంతాల ప్రజలు హర్షించారు. అయోధ్య ఆలయ నిర్మాణం తరవాత కూడా దేశమంతా, ప్రపంచమంతా హర్షించింది. కానీ ఓట్లు మాత్రం బిజెపికి పడలేదు. ఇక్కడ ఓట్లు వేరు..విధాన నిర్ణయాలు వేరని బిజెపి గుర్తించడం లేదు. విధానపరమైన నిర్ణయాలు తీసుకోవలసిందే. అలాగే ప్రజల బాగోగులు, వారి సమస్యలను కూడా చర్చించా ల్సిందే. కానీ బిజెపి అలా చేయడం లేదు. దీంతో ప్రజలు బిజెపి నిర్ణయాలను స్వాగతించినా..ఓట్లను మాత్రం వేయడం లేదు. ఈ విషయంలో బిజెపి అధ్యయనం చేయడం లేదనే చెప్పాలి. ప్రజలకు మెరుగైన పాలన అందించడం వేరు..విధాన నిర్ణయాలు తీసుకుని అమలు చేయడం వేరని గుర్తించలేకపోతోంది. ప్రజలకు కావాల్సింది బతకడానికి అనువైన పరిస్థితులు. పనిచేసుకునేలా ఉపాధి అవకాశాలు రావాలి. పరిశ్రమలు రావాలి. విద్య, వైద్య రంగాల్లో పరిస్థితులు మెరుగు పడాలి. పన్నుల హేతుబద్ధీకరణ జరగాలి. పేదలు నేరుగా పాఠశాలలకు వెళ్లి చదువుకోగలగాలి. జబ్బు చేస్తే నేరుగా ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించు కోగలగాలి. అలాంటి వాటిపై దృష్టి పెట్టడంలో బిజెపి పూర్తిగా విఫలం అయ్యిందనే చెప్పాలి. విద్యావైద్య రంగాలను బలోపేతం చేసేలా బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. రవాణా సౌకర్యాలు మెరుగు పడాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేయగలగాలి. ఇవన్నీ చేసేందుకు అవసర మైన నిధులు కేటాయించాలి. రవాణా ధరలు కూడా ప్రజలకు అందుబాటులో ఉండాలి. రూపాయికి విలువ లేని కాలమిది. వంద రూపాయాలకు భోజనం దొరకని గడ్డుకాలమిది. ఇలా ఎందుకు జరుగుతుందో..ఎందుకు దరలు విపరీతంగా పెరుగుతున్నాయో అన్న విషయాలపై కేంద్రం చర్చించడం లేదు. విశ్లేషించడం లేదు. ఇకపోతే ఉపాధి కోసం సొంతంగా కాళ్లపై నిలబడాలనుకునే వారికి రుణాలు విరివిగా దక్కాలి. విదేశాలకు వెళ్లే విద్యార్థులకు రుణాలు తక్కువ వడ్డీలకు దక్కాలి. పనిచేసేందుకు అవకాశాలు రావాలి. కానీ అలా జరగడం లేదన్న విషయం గుర్తించి నిర్ణయాలు తీసుకోలేక పోతున్నారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలను బలోపతేం చేసే దిశగా ప్రయత్నాలు సాగడం లేదు. మోడీ మాటలు కోటలు దాటడం లేదు. అందమైన మాటలతో ప్రజలను ఎల్లకాలం బురిడీ కొట్టించలేమని గుర్తించాలి. అందుకే వ్రతం చెడినా ఫలితం దక్కలేదన్న సామెత ఇప్పుడు బీజేపీకి సరిగ్గా సరిపోతుంది. మొన్న సార్వత్రిక ఎన్నికల్లో,నేటి జమ్మూకశ్మీర్ ఎన్నికల ఫలితాలు చూస్తే ఇదే స్పష్టం అవుతుంది. 500 ఏళ్ల హిందువుల కల అయోధ్య రామ మందిర నిర్మాణం చేపట్టినా, ఆర్టికల్ 370 రద్దు చేసినా బీజేపీకి చేదు ఫలితం ఎదురైంది. రామ మందిరాన్ని కట్టించి హిందువుల చిరకాల కోరికను నిజం చేసి చూపించారు ప్రధాని మోదీ. అవాంతరాలు, అడ్డంకులు..కోర్టు కేసులు..వివాదాలు అన్నీ ఒక్కొటిగా దాటుకుని భవ్య రామ మందిరం నిర్మాణం పూర్తి చేశారు. రాముడి ప్రతిష్ఠ జరిపారు. దేశమంతా హర్షించింది. అయోధ్య రాముడి సమస్యకు ఇన్నాళ్లకు ఓ పరిష్కారం దక్కిందని దేశ ప్రజలు సంతోష పడ్డారు. అయితే రామ మందిరం నిర్మాణం పూర్తి చేశామన్న ఉత్సాహంతో లోక్ సభ ఎన్నికలకు దిగిన బీజేపీకి ఊహించని షాక్ తగిలింది. అయోధ్య అసెంబ్లీ ఉన్న ఫైజాబాద్ లోక్ సభ నియోజకవర్గాన్ని ఇండీ కూటమిలోని సమాజ్ వాదీ పార్టీ గెలుచుకుంది. అంటే ఇన్నేళ్ల కలను తీర్చిన అయోధ్య ప్రజలు చుట్టు పక్కల నియోజకవర్గాల వాళ్లు బీజేపీని తిరస్కరించారు. ఇది బీజేపికి ఊహించని షాక్ అని చెప్పవచ్చు. అంటే అయోధ్య ఆలయం వద్ద చుట్టుపక్కల ప్రజల జీవితాలు మాత్రం మారలేదు. అయోధ్ అభివృద్ధిలో స్థలాలు కోల్పోయిన వారు ఆనందంగా లేరు. వారికి తగిన పరిహారం దక్కలేదు. తాజాగా రెండో షాక్ తగిలింది. ఆర్టికల్ 370 రద్దుతో కశ్మీర్‌ను పూర్తిగా భారత్‌లో విలీనం చేసినా ఫలితలం లేకుండా పోయింది. కారణం అప్పటికే అక్కడి హిందువులను తన్ని తరిమేశారు. దీంతో అక్కడ పూర్వం నుంచి ఉంటూ వచ్చిన హిందువులు, పండిట్లను కాశ్మీర్‌కు తిరిగి తీసుకుని రాలేక పోయారు. ఆర్టికల్ 370 రద్దు కోసం బీజేపీ ప్రభుత్వం ఏళుగా వ్యూహం పన్నింది. ఫలితంగా కశ్మీర్ రాష్ట్రం హోదా కోల్పోయి రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడిపోయింది. జమ్ము కశ్మీర్ , లద్దాఖ్ అనే రెండు కేంద్రపాలిత ప్రాంతాలు కొత్త ప్రయాణం మొదలు పెట్టాయి. 370 రద్దు తర్వాత తొలిసారిగా అక్కడ ఎన్నికలు జరిగాయి. పాకిస్థాన్ కబంధ హస్తాల్లోనూ..వేర్పాటు వాద శక్తుల చేతుల్లోకి వెళ్లిపోతున్న కశ్మీర్‌ను పూర్తిగా దేశం చేతుల్లోకి తెచ్చుకునేలా.. చేసిన చర్యకు దేశభక్తితో ప్రజలంతా ఉప్పొంగిపోయారు. కానీ స్థానికంగా ఉన్నవారు మాత్రం పాక్ మనస్థత్వం నుంచి బయటపడలేదు. అందుకే అక్కడి ప్రజలు బీజేపీకి పట్టం కట్టలేదు. ఛాందసవాద పార్టీలకే ప్రజలు ఓటేశారు. పదేళ్లుగా దేశాన్ని పాలిస్తున్న మోదీని గద్దె దింపాలని కాంగ్రెస్ దేశంలోనే చాలా విపక్షాలు ఏకం చేసి ఇండీ కూటమిగా ఏర్పడ్డాయి. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి ఊహించనంత పోటీ ఇచ్చింది కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండీ కూటమి. సొంతంగా 99 ఎంపీ స్థానాలు గెలుచుకుని బీజేపీ ఆధిక్యాన్ని తగ్గించటమే కాదు..పార్లమెంటులో బీజేపీ ఆటలు సాగే అవకాశం లేనంత పెద్దశక్తిగా నిలబడింది. మొత్తంగా ప్రజలు నిత్యం ఎదురయ్యే సమస్యలకే ప్రాధాన్యం ఇస్తారని పాలకులు గుర్తించాలి. 370 ఆర్టికల్ రద్దు చేసినా ఇంకా అక్కడి ప్రజలు ఛాందసవాద పార్టీల గుప్పటి నుంచి బయటపడలేదు. దీనిని గుర్తించి బిజెపి తగు నిర్ణయాలు తీసుకోవాలి. అప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయి. విజయగర్వంతో కాకుండా వివేచనతో అడుగులు వేయకపోతే ఈ విజయాలు కూడా దక్కవని బిజెపి నాయకత్వం గుర్తిస్తే మంచిది.




# తెలంగాణలో బలపడడమే లక్ష్యం

## రేవంత్‌పై విమర్శలకు బిజెపి పదును

**హైదరాబాద్,అక్టోబర్ 8:** తెలంగాణలో బిజెపి తన బలాన్ని మరింత పెంచుకునే పనిలో పడింది. అదేపనిగా అధికార కాంగ్రెస్‌ను విమర్శలుచేసే ప్రయత్నాలకు పదను పెడుతోంది. ప్రధాని మోడీ సహా నేతలంతా కాంగ్రెస్‌పై పడ్డారు. కేంద్రంలో తామిచ్చిన హామీలను అమలు చేయలేని వారు తెలంగాణలో మాత్రం అమలు చేయాలన్న పట్టుదలతో ఉన్నారు. తమకో నీతి...తెలంగాణకో నీతి అన్న చందంగా బిజెపి నేతల తీరు ఉంది. తెలంగాణలో బలంగా ఉన్న కాంగ్రెస్‌ను వెంటనే ఆగం చేయాలన్న ఆతురత కనిపిస్తోంది. పది నెలలకే తెలంగాణ ఆగమయ్యిందన్న భావనలో బిజెపి ఉంది. పదేళ్లపాటు మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు పాలనపై అనేక అవినీతి ఆరోపణలు చేసి అలసిపోయారు. ఒక్కటంటే ఒక్క అవినీతి చర్యలపై చర్య తీసుకోలేదు. బిజెపి సెల్ఫ్‌గోల్ కారణంగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు పరిస్థితులు సహకరించాయి. అయినా వారు రాజకీయ పరిస్థితులను గుర్తించడం లేదు. కోటి ఉద్యోగాల హామీని బిజెపి ఎప్పుడో మరిచి పోయింది. విభజన హామీలను తుంగలో తొక్కింది. ఇవన్నీ ఎవరు ప్రశ్నించాలి. ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా రాష్ట్రానికి ఏ విధంగా సాయం వచ్చో ఆలోచించరు. ఎలా నిధులు తీసుకుని రావచ్చో పట్టించుకోరు. విలీన మండలాలపై మాట్లాడరు. ఉమ్మడి రాష్ట్రం నుంచి విడివడ్డ ఆంధ్రప్రదేశ్‌లో మిత్రపక్షాలతో కలిసి బిజెపి అధికారంలోకి వచ్చింది. అక్కడ కేవలం టిడిపి, జనసేన కారణంగా బిజెపి కొంత నిలదొక్కుకో గలిగింది. జగన్ పాలన కూడా ప్రధాన కారణంగా చెప్పుకోవాలి. అరచాక పాలనతో విసిగి పోయిన ప్రజలు ఈ కూటమికి పట్టం కట్టారు. ఇందులో బిజెపి చేసిన ప్రయత్నం ఏమీ లేదు. ఇదంతా చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల ఉమ్మడి కృషిగానే గుర్తించాలి. అయితే ఇదంతా తమ ఘనతగా బిజెపి నేతలు భావిస్తున్నారు. అందుకే తెలంగాణలోనూ ఎలాగైన గంటకొట్టాలన్న ఆత్రుతలో ఉన్నారు. చంద్రబాబు నాయుడుకు భారతీయ జనతా పార్టీతో శాశ్వత మిత్రత్వం ఎప్పుడూ లేదు. గతంలో కూడా ఆయనను పొమ్మనలేక పొగపెట్టడంతో ఐఎన్‌డిఎ కూటమి నుంచి బయటకు వచ్చారు. దీంతో జగన్‌కు పరోక్షంగా బిజెపి మద్దతు ఇచ్చింది. ఇక్కడ కెసిఆర్, అక్కడ జగన్ అవినీతిపై బాకాలూదిన బిజెపి నేతలు ఒక్క కేసులోనూ తేల్చలేకపోతున్నారు. ఇకపోతే లడ్డూ వివాదం చంద్రబాబు నాయుడు లేవనెత్తగానే బిజెపి దేశవ్యాప్తంగా దానిని తనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేసింది. పవన్ కళ్యాణ్ ఇప్పుడు ప్రతిపాదిస్తున్న వారాహి డిక్లరేషన్ ప్రకారం దేశవ్యాప్తంగా సనాతన ధర్మ పరిషత్ ఏర్పడితే .. తిరుమల తిరుపతి దేవస్థానం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేతుల్లోంచి వెళ్లిపోతుంది. ఇది చేయడానికి కేంద్రం ముందుకు వస్తుందా అన్నది ముఖ్యం. దీనికి చంద్రబాబు అంగీకరిస్తారా అన్నది మరీ ముఖ్యం. అందుకే ఇప్పుడు ఎపిని వదిలి తెలంగాణపై పడ్డారు. రుణమాఫీ పూర్తిగా జరగలేదని గోలపెడుతున్నారు. వ్యవసాయ చట్టాలతో వందాలాదిమందిని పొట్టన పెట్టుకుని, వెనక్కి తగ్గని మోడీ కాంగ్రెస్‌పై విమర్శలు చేయడంలోనే రాజకీయం ఉంది. మహారాష్ట్ర, జార్ఖండ్ ఢిల్లీ, బీహార్, బెంగాల్, తమిళనాడు, అసోం రాష్ట్రాల్లో ఎన్నికలు రానున్నాయి. ఈ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ కనుక మంచి ఫలితాలు సాధిస్తే కేంద్ర ప్రభుత్వానికి ఢోకా ఉండదు. అప్పుడు వారు అనుకున్నట్లుగా జమిలి ఎన్నికల జమానా కూడా రాగలదు. అయితే ఈ రాష్ట్రాల ఎన్నికల్లో బిజెపి మంచి ఫలితాలు సాధించగలదా అనేది అనుమానమే. ప్రస్తుతం జమ్మూకశ్మీర్, హర్యానా ఎన్నికల్లో బిజెపికి మిశ్రమ ఫలితాలు వచ్చాయి. అయినా తన ప్రయత్నాలు మరింత పక్కాగా అమలు చేసే క్రమంలో దక్షిణాదిలో విజయం సాధించే ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగానే తెలంగాణలో రేవంత్ ప్రభుత్వాన్ని చీకాకు పెట్టాలని చూస్తోంది. రుణమాఫీ జరగలేదని, ఆరు గ్యారెంటీలు అమలు కావడం లేదని వాదిస్తోంది. 2014లో తెలంగాణ రాష్ట్రం సాధించి ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ స్వయంకృతా పరాధం కారణంగా బిజెపి ఈ స్థాయికి ఎదిగిందనడంలో సందేహం లేదు. తెలంగాణలో బలంగా ఉన్న కాంగ్రెస్‌ను మాటుమాయం చేసే ఆత్రుతలో కెసిఆర్ తీసుకున్న నిర్ణయాలు బిజెపి బలోపేతం కావడానికి దోహదపడ్డాయి. ఇదే అవకాశంగా ఇప్పుడు బిజెపి తన బలాన్ని మరింత పెంచుకునే పనిలో పడింది. దక్షిణాదిలో బలం పెంచుకోవాలని అనుకుంటున్న బిజెపి ఏ చిన్న అవకాశాన్నీ వదులుకోవద్దన్న సంకత్పంలో ఉంది. అందుకు తెలంగాణలో తన ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

# తప్పిన ఎగ్జిట్ పోల్ అంచనాలు

**హర్యానాలో హ్యాట్రిక్ విజయం దిశగా బిజెపి**

**జులానా నుంచి వినేశ్ ఫోగట్ విజయం**

**కాశ్మీర్‌లో ఎన్సీ, కాంగ్రెస్ కూటమి హవా**

**ఒమర్ అబ్దుల్లానే తదుపరి సిఎం అన్న ఫరూక్**

**370ని ప్రజలు తిరస్కరించారని ఫరూక్ వ్యాఖ్య**

**న్యూఢిల్లీ,అక్టోబర్ 8:** హరియాణా, జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తారుమారయ్యాయి. ఉత్కంఠ భరితంగా సాగుతున్న హరియాణా పోరులో భాజపా హ్యాట్రిక్ దిశగా దూసుకెళ్తోంది. తొలుత కాంగ్రెస్ ఆధిక్యంలో ఉండగా.. అనూహ్యంగా కమలం పుంజుకుని ఆధిక్యాల్లో మ్యాజిక్ ఫిగర్‌ను దాటేసింది. వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా వెళ్తోంది. అటు జమ్మూకశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్-కాంగ్రెస్ కూటమికి ఓటర్లు స్పష్టమైన మెజార్టీ ఇచ్చినట్లే కన్పిస్తోంది.ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత అన్ని సర్వే సంస్థలు హర్యానాలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని అంచనా వేశాయి. ప్రస్తుతం ఫలితాల సరళి చూస్తే మాత్రం హర్యానా ప్రజలు మరోసారి బీజేపీని ఆదరించి నట్లు తెలుస్తోంది. ఎన్నికల వేళ కాంగ్రెస్ చేసిన తప్పిదాలే ఆ పార్టీ మెజార్టీ మార్క్ సాధించక పోవడానికి కారణంగా విశ్లేషిస్తున్నారు. హర్యానా ఎన్నికల్లో అందరినీ దృష్టిని ఆకర్షించిన రెజ్లర్ వినేశ్ ఫోగట్ కాంగ్రెస్ అభ్యర్థిగా జులానా నుంచి పోటీచేసి గెలుపొందారు. హరియాణాలో మొత్తం 90 అసెంబ్లీ స్థానాలున్నాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే 46 స్థానాలు అవసరం. ప్రస్తుతం ఇక్కడ భాజపా ఆధిక్యం, గెలుపు కలిపి 47 స్థానాల్లో దూసుకెళ్తోంది. కాంగ్రెస్ 37 స్థానాలకు పరిమితమైంది. ఐఎన్ఎల్‌డీ 2, ఇతరులు 4 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఖాతా తెరవకపోవడం గమనార్హం. హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తప్పాయి. ఇక్కడ బీజేపీ స్పష్టమైన ఆధిక్యం దిశగా దూసుకెళ్తోంది. ఇప్పటికే మ్యాజిక్ ఫిగర్‌ను దాటి అత్యధిక స్థానాల్లో ముందంజలో ఉంది. హర్యానాలో 90 అసెంబ్లీ స్థానాలకు గానూ కమలం పార్టీ 51 స్థానాల్లో లీడింగ్‌లో ఉంది. దీంతో బీజేపీ శ్రేణులు సంబరాలు షురూ చేశారు. పార్టీ అత్యధిక స్థానాల్లో లీడింగ్‌లో ఉండటంతో బీజేపీ నేతలు, కార్యకర్తలు సంబరాలు మొదలు పెట్టారు. అంబాలో పార్టీ జెండాలను చేతపట్టుకుని డ్యాన్సులు చేస్తూ సందడి చేశారు. మిఠాయిలు తినిపించుకున్నారు. కొన్ని చోట్ల బీజేపీ శ్రేణులు టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఓ రకంగా చెప్పాలంటే హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు టీ 20 మ్యాచ్‌ను తలపించాయి. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపులో దూసుకెళ్లిన కాంగ్రెస్ ఒక్కసారిగా పడిపోయింది. ఈవీఎంలు లెక్కింపు తర్వాత వైకుంఠపాళీ ఆటలో మాదిరిగా కాంగ్రెస్ ఒక్కో సీటు తగ్గుతూ వచ్చింది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌లతో ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. మొదట్లో కాంగ్రెస్ దూసుకెళ్లింది. దాదాపు అరవైకిపైగా స్థానాల్లో ఆధిక్యం చూపించింది. ఈ దెబ్బకు బీజేపీకి 20 స్థాలైనా వస్తాయా అన్న అనుమానం కలిగింది. కానీ 10 గంటల తర్వాత ఫలితాలు తారుమారు అవుతూ వచ్చాయి. అప్పటి వరకు విజయం దిశగా దూసుకెళ్తున్న కాంగ్రెస్ ఒక్కసారిగా పడిపోయింది. బీజేపీ సునామీ మొదలైంది. ఒకానొక దశలో ఇరు పార్టీల మధ్య హోరాహోరీ పోరు తప్పదేమో అన్నట్టు ఫలితాలు వచ్చాయి. అయినా చివరకు బీజేపీ పై చేయి సాధించింది. యాభైకు పైగా స్థానాల్లో ఆధిక్యం చూపించి హర్యానాలో ఒంటరిగానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. హర్యానాలో మొదటి ట్రెండ్స్ చూసిన కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. ఏఐసీసీ కార్యాలయం వద్ద స్వీట్స్ పంచుకున్నాయి. బాణసంచా పేల్చాయి. వాళ్ల సంతోషం ఎంతసేపు నిలవలేదు. అక్కడ బీజేపీ అధికారంలోకి వచ్చేలా ఫలితాలు వస్తున్నాయి. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ దూసుకెళ్తోంది. కాశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ దూసుకెళ్తోంది. ప్రస్తుతం ఆధిక్యం, గెలుపు కలిపి 43 స్థానాల్లో దూసుకెళ్తోంది. ఇక, భాజపా 28, పీడీపీ 2, కాంగ్రెస్ 7 స్థానాల్లో ముందంజలో ఉన్నాయి. ఇతరులు 10 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఇక్కడ, భాజపా, పీడీపీ ఒంటరిగా పోటీ చేశాయి. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ పొత్తులో ఉన్నాయి. ఎన్నికల ముందే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్న ఈ పార్టీ.. తాజాగా వెలువడుతున్న ఫలితాల్లో మ్యాజిక్ ఫిగర్‌ను దాటింది. దీంతో తదుపరి ముఖ్యమంత్రి ఎవరనేది ఆసక్తికరంగా మారింది.

## విజయనగరం ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు

**పరిశీలించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

**జిల్లా ఖ్యాతిని విస్తరించేలా చేస్తామని ప్రకటన**



**విజయనగరం,అక్టోబర్ 8:** విజయనగరం జిల్లా ఖ్యాతి ఇనుమడించేలా విజయనగరం ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మన వైభవాన్ని దశదిశలా చాటేందుకు ఈ ఉత్సవాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఎంఎల్ఏ పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజుతో కలిసి మంత్రి శ్రీనివాస్ ఉత్సవ వేదికలను మంగళవారం పరిశీలించారు. ముందుగా విజ్జీ స్టేడియంను సందర్శించారు. నూతనంగా నిర్మితమైన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంను పరిశీలించి, ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. విద్యుత్ సదుపాయం కోసం 160 కెవి ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని చెప్పారు. స్కేటింగ్ ట్రాక్‌ను, వాలీబాల్ కోర్టును, పోటీలు నిర్వహించే క్రీడామైదానాన్ని, క్రికెట్ స్టేడియంను పరిశీలించారు. ఫ్లడ్ లైట్లు, నెట్లను ఏర్పాటు చేయాలన్నారు. స్టేడియంలో భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్టేడియం నుంచి స్కేటింగ్ ట్రాక్‌కు మెట్లు నిర్మించాలని సూచించారు. కోట వెనుకభాగంలో జరుగుతున్న సుందరీకరణ పనులను మంత్రి పరిశీలించారు. అక్కడ లేజర్‌షో ద్వారా విజయనగరం చరిత్రను వివరించనున్నట్లు ఎంఎల్ఏ తెలిపారు. ఆ ప్రాంతాన్ని అందంగా, అహ్లాదకరంగా తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. అనంతరం మాన్సాస్ గ్రౌండ్‌లోని సరస్ డ్వాక్రా ఎగ్జిబిషన్ ఏర్పాట్లను పరిశీలించారు. పుష్పప్రదర్శన స్టాల్, సాంస్కృతిక కార్యక్రమాల వేదికలను సందర్శించారు. వాహనాల పార్కింగ్‌కు ఇబ్బంది రాకుండా అక్కడ స్థలాన్ని చదునుచేసి, సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. ఈనెల 10వ తేదీన ప్రారంభం కానున్న అఖిలభారత డ్వాక్రా బజార్ (సరస్) పోస్టర్లను, పాంప్లేట్లను ఈ సందర్భంగా మంత్రి ఆవిష్కరించారు. విజయనగరం జిల్లా ఖ్యాతి ఇనుమడించేలా, గత వైభవాన్ని చాటిచెప్పేలా ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఉత్సవాలను పురస్కరించుకొని ఉత్తరాంధ్రస్థాయి క్రీడాపోటీలను విజ్జీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రీడా సౌకర్యాలతోపాటు, క్రీడాకారులకు వసతి సౌకర్యాలను కల్పిస్తున్నామని చెప్పారు. మైదానానికి చేరుకొనేందుకు బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. నిర్మాణం పూర్తయిన మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియంను త్వరలో క్రీడామంత్రి చేత ప్రారంభింపజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ప్రకటించారు. దాదాపు 95 శాతం నిర్మాణం పూర్తయిన ఈ ఇండోర్ స్టేడియంను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, గత ఐదేళ్లలో ప్రారంభించలేకపోయిందని విమర్శించారు. జిల్లాల ఏర్పాటైన క్రీడా పాఠశాలను కడప తరలించుకుపోయినా, అప్పటి నాయకులు ఎందుకు అడ్డుకోలేకపోయారని ప్రశ్నించారు. యువతలో క్రీడా నైపుణ్యాన్ని పెంచేందుకు, క్రీడా పాఠశాలను జిల్లాకు తిరిగి రప్పిచేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. విద్యార్థులు, యువత క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని మంత్రి కోరారు. అంతర్జాతీయ ప్రమాణాలతో విజ్జీ స్టేడియంను తీర్చిదిద్ది, పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు కృషి చేస్తున్నామని ఎంఎల్ఏ అదితి గజపతిరాజు చెప్పారు. 1985లో విజ్జీ స్టేడియంను ప్రారంభించారని, అప్పట్లోనే ఎంతో దూర దృష్టితో మాజీ కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు పిపిపి విధానంలో ఈ స్టేడియంను అభివృద్ది చేసేందుకు సంకల్పించారని తెలిపారు. యువత తమ క్రీడా నైపుణ్యాన్ని మెరుగు పరుచుకొనేందుకు, పోలీస్, ఆర్మీ, రిక్రూట్‌మెంట్లకు సిద్ధం అయ్యేందుకు ఈ స్టేడియం ఎంతగానో దోహదం చేస్తోందని చెప్పారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, ఎపిఈపిడిసిఎల్ ఎస్ఈ లక్ష్మణరావు, డిఆర్‌డిఏ పిడి ఎ.కల్యాణచక్రవర్తి, ఏపిడి సావిత్రి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వర్రావు, ఉత్సవ కమిటీ సభ్యులు ఐవిపిరాజు, ఇతర అధికారులు, కోచ్‌లు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

**మోహినీ అవతారంలో దర్శనమిచ్చిన శ్రీవారు**

**మాడవీధుల్లో స్వామిని దర్శించి తరించిన భక్తులు**




**తిరుమల,అక్టోబర్ 8:** తిరుమల తిరుపతి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ఐదవ రోజైన మంగళవారం శ్రీ వేంకటేశ్వర స్వామివారు విశ్వ సుందరి మోహిని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.శ్రీనివాసుడు విశ్వ సుందరి మోహిని రూపంలో శృంగార రసాధి దేవతగా సర్వాలంకార భూషితుడై దర్శనమిచ్చారు. మోహినీ అవతారం.. మాయా మోహ నాశనం. ఈ అవతారం ద్వారా జగత్తు అంతా మాయామోహానికి లొంగివుందని, అదంతా తన లీలా విలాసమేనని, తన భక్తులు కానివారు ఈ జగన్మాయలోలులు కాక తప్పదని చాటి చెబుతున్నారని విశ్వాసం. విశ్వమంతా తన మాయ సృష్టి అని భక్తులకు సందేశం ఇస్తుంది. ఈ మాయను అధిగమించాలంటే అందరూ ఆయనను ఆరాధించాలి. శ్రీనివాసుడు విశ్వ సుందరి మోహిని రూపంలో శృంగార రసాధి దేవతగా సర్వాలంకార భూషితుడై దర్శనమిచ్చారు. మోహినీ అవతారం.. మాయా మోహ నాశనం. ఈ అవతారం ద్వారా జగత్తు అంతా మాయామోహానికి లొంగివుందని, అదంతా తన లీలా విలాసమేనని, తన భక్తులు కానివారు ఈ జగన్మాయలోలులు కాక తప్పదని చాటి చెబుతున్నారని విశ్వాసం. విశ్వమంతా తన మాయ సృష్టి అని భక్తులకు సందేశం ఇస్తుంది. ఈ మాయను అధిగమించాలంటే అందరూ ఆయనను ఆరాధించాలి. రంగురంగుల పట్టు వస్త్రాలు ధరించి, మిరుమిట్లు గొలిపే ఆభరణాలు ధరించి, చక్కగా అలంకరించబడిన పల్లకిపై కూర్చొని.. పక్కనే మరో తిరుచ్చిపై శ్రీకృష్ణుడు అలంకృతుడై అభయమిచ్చారు. ÷రిళిహిని అవతారంలో పక్కనే తిరుచ్చిపై శ్రీకృష్ణుడు అలంకృతుడై నాలుగు మాడ వీధుల్లో గజరాజులు ముందు నడుస్తుండగా, భక్తజన బృందాలు భజనలు, కోలాటాల నడుమ భక్తులను మంత్రముగ్ధులను చేస్తూ దర్శనం ఇచ్చారు శ్రీవారు. బ్రహ్మోత్సవాల్లో ఈ రోజు కీలక ఘట్టం గరుడ సేవ ఉండనున్నందున తిరుమల కొండ భక్తులతో కిటకిలాడుతోంది. మరోవైపు శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటల సమయం పడుతోంది.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101